

# అత్యాచారానికి వెలవుంది

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆ రోజు దిన పత్రికలోని ముఖ్య మంత్రి స్టేట్‌మెంట్‌ని చదివిన కోడి రంగసామికి ఓ అద్భుతమైన ఐడియా వచ్చింది. తేలిగ్గా కనీసం పది పదిహేను వేలయినా సంపాదించవచ్చు అనుకున్నాడు.

'మైనర్ బాలికయి అత్యాచారానికి గురయినపక్షంలో వారికి అయిదు వేల నుంచి పాతిక వేలకి నష్ట పరిహారాన్ని పెంచుతున్నాం' అని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఇచ్చిన స్టేట్‌మెంట్ అది.

వెంటనే తన మిత్రుడు పోలీసెంకట సామి దగ్గరకి వెళ్ళి వార్త చూపించాడు.

"దాన్నిబట్టి నీకేం అనిపిస్తోంది?" అడిగాడు.

"తను ముఖ్యమంత్రిగా వున్నంత కాలం మైనర్ బాలికల మీద అత్యాచారం జరుగుతూనే వుంటుందని మన ముఖ్యమంత్రి నమ్ముతున్నాడని"

"ఛత్. అది కాదు" కోప్పడ్డాడు కోడి రంగసామి.

"అవునవును. అది కాదు. అత్యాచారానికి గురయిన మైనర్ బాలికకి అయిదు వేలు తక్కువని, పాతిక వేలిస్తే ఆ నష్టపరిహారం సరిపోతుందని."

"అందుకే నిన్ను పోలీసెంకటసామి అన్నారు. అది కాదు. ఇందులో మనం సంపాదించుకునేందుకు ఆస్కారం వుందని తోచడం లేదా నీకు? ఓ మైనర్ బాలికకి అత్యాచారం జరిగిందనుకుందాం. పాతిక వేలు వస్తాయి కదా."

"అవును సుమా. ఇంతకీ నీ ప్లానేంటి?"

"చెప్తా విను."

* * *

మర్నాడు కాక ఆ మర్నాడు పేపర్‌లో గుప్పుమంది- పదమూడేళ్ళ మైనర్ బాలిక అయిన సీతాలు మీద కోడి రంగసామి అత్యాచారం జరిపాడని. సీతాలు పొలంలో గడ్డి కోసు కుంటుండగా కోడి రంగసామి తన మేనకోడలయిన సీతాలుని ఆ కోసిన గడ్డిమీద పడేసి బలాత్కారం చేసి చెరిచాడు.

సీతాలు ఏడుస్తూ ఆ సంగతి తన తల్లితండ్రులకి చెప్తే వాళ్ళు పోలీసెంకటసామికి రిపోర్ట్ చేశారు. వెంటనే సీతాలుని గవర్నమెంట్ హాస్పిటల్‌కి పంపించాడు పోలీసెంకటసామి. సర్కారి డాక్టర్ ఆమెని పరీక్షించి అత్యాచారం బలంగా జరిగిన మాట వాస్తవమే అని నిర్ధారణ చేసాడు. వెంటనే పోలీసెంకటసామి కల్లు పాకలో వున్న కోడి రంగసామిని అదుపులోకి తీసుకున్నాడు. అతని మీద కేసు రాసాడు.

సీతాలు తల్లితండ్రులు ఆ జిల్లా కలెక్టర్‌కి అర్జీ పెట్టారు, మైనర్ బాలిక అయిన తమ కూతురు సీతాలు మీద అత్యాచారం జరిగిందని, నష్ట పరిహారంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పెంచిన పాతికవేలు ఇవ్వమని. ఆ వార్త కూడా ఆ అర్జీకి జతపరిచారు. జీ.వో.లు, గీ.వోలు చూసిన అనంతరం కలెక్టర్ సీతాలు తలితండ్రులకి గ్రామ పెద్దల ముందు పాతిక వేల రూపాయలకి చెక్కు అందజేశాడు. ముఖ్య మంత్రి విధానాలను అమలుజరపడానికే తమ లాంటి ఉద్యోగస్తులు ప్రభుత్వానికి వున్నారని నొక్కి వక్కాణించాడా కలెక్టర్.

ఆ పాతికవేలు కేష్ అయాక పోలీసెంకటసామికి అయిదు వేలు, సర్కారి డాక్టర్‌కి అయిదు వేలు ముట్టగా, సీతాలుకి పదిహేను వేలు మిగిలింది. తమకి పదిహేనువేలు సంపాదించి ఇచ్చినందుకు కోడి రంగసామి అక్క బావలు ఎంతో సంతోషించారు.

కన్యాత్వం కోల్పోని సీతాలు అడిగింది కోడి రంగసామి రెండేళ్ళ తర్వాత జైలు నించి తిరిగి వచ్చాక.

"నా మూలంగా నువు జైలు కెళ్ళాల్సి వచ్చింది కదరా మామ?"

"ఛ. నీ వల్ల కాదే. పదిహేను వేలు ఖచ్చితంగా చేతిలో పడుతుంది కాబట్టి. ఒకోసారి దొంగతనం చేస్తే నాలుగైదు వేలు కూడా చేతిలో పడదు. పట్టు బడితే ఇదే రెండేళ్ళు జైల్లో కూర్చోవాలి. కానీ కష్టం లేకుండా పదిహేను వేలు వస్తుంటే చేదా?" జవాబు చెప్పాడు కోడి రంగసామి.

ఆ తర్వాత కోడి రంగసామి అక్కయ్య ఓ రోజు అడిగింది.

"రంగసామి. నా చిన్నదానికి పన్నెండేళ్ళు వచ్చేస్తాయి రేపటికి. మా బాబు కదూ? ఇంకోసారి అత్యాచారం చేసి పెట్టవూ?" ●

